# జీవాతువు

**జూ**నియర్ కాలేజి ప్రిన్సిపాల్ రామచంద్రయ్యగారు అర్జెంటుగా చూడవలసిన ఆఫీసు కాగితాలు చూడటం పూర్తయింది. సంతకాలు పెట్టిన కాగితాలు తీసుకెళ్లి స్క్రీనుకు అవతలగా 'ఆఫీసు'లో కూర్చున్నాడు పెద్దగుమాస్తా. డోర్‌ప్యూను జకరయ్య వాకిట్లో నిలుచుని ఎవరితోనో మెల్లగా మాట్లాడుతున్నాడు. ప్యూనుశేషయ్య ఎటెండెన్సురిజిష్టరు పట్టుకుని క్లాసుల్లోకెళ్లాడు. స్వీపరు చెంచురాముడు వరండాలో ఊడుస్తుంటే చీపురు బరబరా శబ్దంచేస్తున్నది. జరుగుతున్న క్లాసుల్లోంచి సన్నగా రణగొణధ్వని వినబడుతున్నది. లెక్చరర్లను వెయ్యనందున సగం క్లాసులు జరగటమేలేదు. చదవ్వలసిన పాఠాలు రెట్టింపుచేసి, చెప్పవలసిన లెక్చరర్లను వెయ్యకుండావుంటే మేము ఏమైపోవాలని విద్యార్థులు గోలపెడుతున్నారు. కాలేజికి రాకుండా స్ట్రైయిక్‌చేస్తామని అన్నారుగాని ఇంకా అది ప్రారంభం కాలేదు.

ఈదినం పోస్టు తక్కువగా ఉన్నది. అందులో టైపిస్టు సెలవులో ఉన్నాడు. ఇహ ఆ ఇంటర్వ్యూలు అయిపోతే తతిమ్మాపని ఏమంతగా లేదు. శీనయ్యను ప్రూన్ చేసిన పని తాలూకు ఖాళీ భర్తీ చెయ్యడానికి ఇంటర్వ్యూలు పదినిముషాల్లో ప్రారంభం అవుతాయి.

రామచంద్రయ్యగారు చీకాగ్గా కోపంగా ఉన్నారు. 'వెధవకి కడుపునిండగానే పొగరు తల కెక్కింది. ఆకాశరామన్న పేరుతో అయితేమాత్రం అన్నిబూతులు తిడతాడా! పని దొరికేవరకూ ఒక ఏడుపు. దొరికినతర్వాత ఇంకో ఏడుపు. తృప్తి అనేది ఎక్కడుంది?' అనుకున్నారు. డ్రాయరు సొరుగు లోంచి భావనఅల్లంపొట్లం తీసి రెండుపలుకులు నోట్లో వేసుకున్నారు 'వీళ్లు చేస్తున్న చిన్నతప్పులు పట్టించుకోకుండా వదిలేస్తున్నందుకు వాడికి కళ్లు నెత్తిమీదకొచ్చినై. అదేదో సామెత చెప్పినట్లు రౌతుమెత్తనైతే గుర్రం ఏవిటో చేసిందట... అయినా ఈదేవుడు మతిలేనివాడు. మంచివాడికి కష్టం పెడతాడు. చెడ్డవాడికి జయం ఇస్తాడు. ఈ సమస్తసృష్టికీ తాను బాధ్యుడై ఉండీ కూడా యీ అస్తవ్యస్తాలను యిలా కొనసాగనిస్తున్నాడంటే... మతివుండేవాడైతె అన్నీ ఒకక్రమంలో

పెట్టి చక్కగా నిర్వహించుకోడూ?' అనుకున్నారు ప్రిన్సిపాల్ ధోరణిలో. ఆయనకు చీకాకు కలిగినప్పుడు యిట్లాగ దేవుణ్ణి కోప్పడ్డం ఒక అలవాటు.

అయినదానికీ కానిదానికీ దేవుణ్ణి తలుచుకోవటం ఆయన తాత రామచంద్రయ్యగారి నుండీ వారిమీది గౌరవంకొద్దీ సంక్రమించిన అలవాటు. కాని తాతగారికీ మనవడికీ మాటతీరులో సామ్యమేగాని ఆలోచనల తీరులో పెద్ద భేదం ఉన్నది. తాత రామచంద్రయ్యగారికి దేవుడిమీద ఎంత నమ్మకం ఉన్నదో తప్పొప్పులగురించి అంత స్పష్టత ఉన్నది. ఏది మంచో, ఏది చెడో స్పష్టంగా తెలుసు. త్రికరణశుద్ధిగా 'మంచి'గా ఉంటూ తృప్తిగా బ్రతికారు. ప్రిన్సిపాలు రామచంద్రయ్యగారు తాతగారిలాగా 'మంచి'గానే ఉంటున్నారు. కాని దేవుణ్ణి గురించిన స్థిరమైన అభిప్రాయం ఏమీలేదు. అనుకోవలసి వచ్చినప్పుడు 'కలడు కలండనెడివాడు కలడో లేడో' అనుకుంటారు. 'తప్పు'అన్నా 'ఒప్పు'అన్నా నిర్వచనం తెలియటం లేదు.

అసలు మంచి చెడ్డ అన్న మాటలకు అర్థాలే నిశ్చితంగా లేవు. అయితే ఆయనకు తనకు కావల్సిందేమిటో మాత్రం తెలుసు. అది జీవించటంలో నిండుదనం-బ్రతుకును పండుగగా చేసే కిటుకు. అదే ఆయనకు అందనిది.

ఇంతవరకు ఆయన అన్నీ పట్టణాల్నే చూశారు. మొదట్లో ఈ చిన్నవూరికి బదిలీ మీద వచ్చినప్పుడు అక్కడ కన్పించిన పచ్చదనం, వైశాల్యం, ఎల్లెడలా కనిపించిన ప్రకృతిశోభ కొన్ని ఆశలు కల్పించాయి. ప్రకృతిమాత ఒడిలో పెరుగుతున్న ఇక్కడి మనుషులు ఈ సహజతలో, నిండుదనంలో నీతిగా, రీతిగా, తృప్తిగా బ్రతుకుతూ వుంటారని జీవితసత్యానికి దగ్గరగా వుంటారని అనుకున్నారు. కానీ ఇక్కడ అలసత్వం, తీరులేని చేష్టలు, అతితెలివి మాత్రమే ఎదురయ్యాయి. ఇంతవరకు అమాయకత, నిండుదనం ఎదురుపడలేదు. అయితే పని వొత్తిడి తగ్గి ప్రపంచం పోకడను గమనించే తీరిక, వెసులుబాటు దొరికాయి.

ఇంతలో ఈ శీనయ్య గొడవ వచ్చింది.

ఇంటర్వ్యూకి పిలిచినవాళ్ల లిస్ట్ చూసుకున్నారు. పదిమంది మెకానిక్కులు-ఒక్క జవాను పనికోసం! కాలేజి బావి మోటారు చూసుకోడానికి, గ్యాస్‌రూంలో సహాయానికి పనికొస్తాడని 'మోటారు మెకానిజం తెలిసుంటే బాగుంటుంది.' అని వ్రాశారు ఎంప్లాయ్‌మెంట్ ఎక్చేంజికి. ఫలితంగా ఈ పదిపేర్లు పంపారు. అందరూ అంతో ఇంతో మెకానిజం తెలుసుకుని పనులు చేసుకుంటున్నవాళ్లే. వుద్యోగం ఇచ్చే భద్రతకోసం చేస్తున్న పనిని వొదులుకుని ఈ పనిలోకి రావాలని ఆశిస్తున్నారు.

ఇంటర్వ్యూ ప్రారంభం అయింది. పదిమందిని పిలిస్తే అయిదుగురే వచ్చారట. పల్లెటూరని కాబోలు! దేవుడిచ్చిన గాలీ, వెలుతురూ, భూమీ, ఆకాశం మీద కంటే మనిషి

తయారుచేసుకున్న సౌకర్యాల మీద, నాగరికత మీద మోజు ప్రజలకు... మొదటి కాండిడేట్ రమణయ్య ఎక్కడో ట్రాక్టర్ డ్రయివర్‌గా వుంటున్నాడు. ఎట్లయినా గవర్నమెంటు వుద్యోగమంటే గట్టి కనుక ఇందులోకి వస్తాడట. ఉదయమే ఇంటి దగ్గర హాజరై ఆ వూరి పద్ధతిన స్థానిక రాజకీయనాయకుడి దగ్గర్నుంచి తెచ్చిన రెకమెండేషన్ లెటర్ ఇచ్చాడు. అంతటి నాయకుడు తనకు ముఖాముఖి తెలుసునన్న ఠీవిని చిందిస్తూ నిలుచున్నాడు. 'వీడు ఇంకో శీనయ్యే' అనుకున్నారు... కానీ శీనయ్య మొదట వచ్చినప్పుడు తలకు గుడ్డ చుట్టుకుని చేతులు కట్టుకుని, వెర్రి మొహం పెట్టుకుని చిరిగిన ప్యాంటుతో వచ్చిన ఇరవైఏళ్ల కుర్రాడని గుర్తుకొచ్చింది.

"అయ్యగారిని జూత్తే నోట్లో మాట్రాదు, నంగిపలుకులు బలుకుతడు. ఎదవ పొగురు బలిసి, వుండేపని పోంగొట్టుకున్నడు గానీ సూత్తుండు, ఆడికర్మ ఆడే అనుబగిత్తడు. పని దొరక్క మలమలమాడ్తడు. ఆడికేంగావాలో ఆడికేదెలీలా! అడేంజెయ్యక పోతే అయ్యగారు ఎందుకు తీసేత్తరు! బువ్వపెట్టినోళ్లకి దణ్ణం పెట్టాల... అడివాచీ, ఆడి సెప్పులు, టూడెంటు మాదిరి ఆడి ఏషికం... ఏందో సేనుంటడు... వచ్చినప్పుడు ఎంత బయంగా వచ్చిండు! ఈడకొచ్చి ప్యాంటు చించుకొని పేరుపిలవంగనే గజాల్ని తలగుడ్డ సుట్టేసి అమట్న లోపలికిబొయిండు... జనానంటే ఇట్టుండాల అనిపించుండు" - వాకిట్లో వుండే ఆఫీసు ప్యూను జకరయ్యతో స్వీపర చెంచురాముడు చెప్పుకొస్తున్నాడు నిన్నటిరోజు మధ్యాన్నం.

చెంచురాముడికి నంగిపలుకులు లేవు. దేనిగురించీ సందేహమూ లేదు.

జకరయ్య నోట్లో నాలుక లేనట్లుంటాడు గనుకనూ, తనకన్నా అలస్యంగా పనిలో జేరాడు గనుకనూ తన స్వగతాలన్నీ జకరయ్యదగ్గరే చెప్పుకుంటాడు చెంచురాముడు, తీరికున్నప్పుడు. వాడి పద్దెనిమిదేళ్ల గొంతు ఖంగుమని పలుకుతుంది. అర్థింపునీ అజ్ఞనీ ఏడుపునీ నవ్వునీ అన్నింటినీ ఒకేస్వరంతో ఒకేధీమాతో వెలువరించే గొంతు అది. ఇప్పుడే బాల్యంనుంచీ పురుషత్వంలోనికి ఒరుగుతున్నది. ఏరు పారుతున్నట్లు అగకుండా గలగలా పరుగులెత్తుతూ వుంటుంది వాక్ప్రవాహం, రోజూ ఏదో ఒక సమయంలో బయటినుండీ విన్పించే ఉపన్యాసాలు వినటం రామచంద్రయ్యగారికి అలవాటైపోయింది. వీడు ఏడవటంకూడా నవ్వుతూనే ఏడుస్తాడేమో! అనుకుని నవ్వుకుంటుంటారు.

శీనయ్యను పనిలోనుంచీ తీసేసిన మూడు రోజులకు ఆశతో మెరిసే కళ్లతో చేతులు జోడించి నాటకీయపు వినయంతో భయం భయంగా నడుస్తూ, నవ్వటానికి ప్రయత్నిస్తూ ఆఫీసులోనికొచ్చాడు చెంచురాముడు. తనకు ప్రమోషన్ కావాలట. శీనయ్యపని తన కిప్పియ్యాలట. కాళ్లు పట్టుకుంటాడట. ఏ పని జెప్పినా బయంగా జాగ్రత్తగా జేసుకుంటాడట. 'ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసు నుంచీ నీ పేరొస్తేగాని నేనేమీ

చెయ్యలేను. వొస్తే చూద్దాంలే' అన్నారు అప్పుడు. 'యిచ్చేవోళ్లు... తమ దయ' అని దణ్ణంపెట్టి వెళ్లాడు. వాడి పేరు లిస్టులో రాలేదు...

కిటికీలోంచి కనబడుతుంది 'కాలేజీ తోట'. తోటమాలిని పెట్టడానికి గవర్నమెంటువారికి డబ్బు చాలదు కనుక చెంచురాముడే తోటపని చూసుకోవాలి. బాటనీ లెక్చరరు అవసరంఅని తెచ్చిపెట్టిన పిచ్చిమొక్కల్ని ఖూనీ చెయ్యడం, తనకు మంచివని తోచిన నాలుగు మొక్కలకు నీళ్లుపెట్టడం తోటమాలిగా చెంచురాముడు నిర్వర్తిస్తున్న బాధ్యతలు. బాటనీ డిపార్టుమెంటునుంచీ వాడిమీద వారానికో ఫిర్యాదు వస్తుంది... ఊరికే అనవసరంగా తనను బాధపెట్టడానికే బాటనోళ్లు పిచ్చిమొక్కల్ని తెచ్చిపెడుతున్నారని చెంచురాముడు జకరయ్యతో అంటుంటాడు... తోట నడిమధ్యన ఒక బాదంచెట్టు కొమ్మలు బారలు చాచుకుంటూ పైకెదిగి పోతున్నది. ఒక మూలన నాలుగు బొప్పాయి మొక్కలు స్తంభాల్లా పైకి లేచాయి. తొట్లలోపెట్టిన అరడజను క్రోటనుమొక్కలూ, ఒక ముద్దమందార, ఒక వరుసలో పది మెట్టతామరలూ - అదే కాలేజితోట. పనిలేనప్పుడంతా రామచంద్రయ్యగారి కళ్లు తోటవేపు తిరిగి పోతుంటాయి. ఆ పచ్చదనంతో ఆయన కేదో తాదాత్మ్యం... ఇవ్వాళ కిటికీలోంచీచూసిన ఆయన కళ్లకు పాదులనిండా దట్టంగా పెరిగి పోయిన కలుపుమొక్కలు పచ్చగా నవనవలాడుతూ కనిపించాయి. 'అరె, కలుపుతియ్యడం లేదే... బాటనోళ్ల తోట అనవసరం అనుకున్నాట్లున్నాడు. వాడికి ఎంత తోస్తే అంతే గట్టిగా వివరంగా చెప్పాలి' అనుకుని కాలేజి వాస్తవంలోకి వచ్చారు.

క్రితంరోజు ఉదయం యీ ఉద్యోగం కోసమే యీ ఊరివాడే వెంకయ్య అనే మనిషి ఒచ్చాడు. అతనికి ఇంటర్వ్యూ కార్డు రాలేదట. కాని అయ్యగారు మంచి వాళ్లనీ, మనుషుల కష్టం సుఖం గమనిస్తారనీ విని తన సంగతి చెప్పుకుందామని వొచ్చాడట.

"బాబూ, నాకు పెళ్లాం, ముగ్గురు బిడ్డలూ, ముసలితల్లీ వున్నారు. ఒక్కడి కష్టంమీద బతకలేకుండా వున్నాం. రెండేళ్ల కింద రిజిష్టరు జేయించుకున్నాను యంప్లాయ్‌మెంట్ ఆఫీసులో... ఏమని చెప్పుకునేది బాబూ ఈ నడిమద్దెల్లో ఒకతడవ ఇంటర్వ్యూ కొస్తే గూడ యీడ పనిలో వున్న శేషయ్య నా నోట దుమ్ము కొట్టాడు బాబూ... ఇంటర్వ్యూకార్డు రాకుండా జేశాడు" అని చెప్పుకున్నాడు. వెంకయ్యకు ఆవేశంతో మొహం ఎర్రబడ్డది. చేత్తో మొహం తుడుచుకున్నాడు.

"బాబూ, ఆ శేషయ్య సంగతి మీకు బాగా తెలవదు ఒట్టి... వాడి అన్న పోష్టుజమానుగా వున్నాడు. మాకూ వాళ్లకీ గోడతగాదా వుంది. అన్నాదమ్ముళ్లిద్దరూ కూడబలుక్కొని యీ పని జేశారు..." ఇంతదాకా చెప్పినాక వెంకయ్య కళ్లల్లో ఒక తెలివి మెరిసింది. గొంతు తగ్గించి "ఈ చుట్టుపక్కల్లో యేఆఫీసులో నన్నా ఉద్యోగం కాళీపడగానే వాడిఅన్న అందరిదగ్గరా తలో యాభైరూపాయలు పుచ్చుకుని తీసుకెళ్లి

యంప్లాయ్‌మెంటు ఆఫీసులో కొంత యిచ్చి వాళ్ల పేరు లిష్టులో ఏపిస్తాడు. మాబోటోళ్ల పేర్లు రానీరు. మొన్న సెలవల్లో బ్రిడ్జికాడ కూర్చోని 'ఆఫీసులో అయ్యగారు నేనెట్టజెప్తె అట్టజేస్తాడు. ఈ ఎంకడికి పనిరానియ్యను ఒస్తే నా ఉత్సనేదాగుతా' అని పెతిజ్ఞగూడ జేశాడు బాబూ" అన్నాడు. చెప్పాలని వచ్చిన విషయం అయ్యగారి చెవిలో వేసి, ధీమాగా నడుస్తూ వెళ్లిపోయాడు.

"ఆ శేషయ్యని జూసి బయపడతరెందయ్యాయేంది, అయిదు నిమిసాలు ఆలీసెంగొత్తే అయ్యగారు తలదీత్తారా, ఏందీ అని... అందరూ బయపడి ఆయనకు రోజూ కాఫీలూ టిపిన్లూ బలేగ మేపుతుండరు. ఇంకా కుంటోడికో గుడ్డోడికో బిచ్చగాడికో యిరాదా... నన్నుమాత్రం బతకనిత్తన్నాడా ఆయన. పూరికూరికెనే నామింద పెత్తనం జేత్తడు. నివ్వు కంటింజెన్సోడివి. అయ్యగారు యియ్యాల బొమ్మంటే బోవాల్సిందే' అంటడు. ఆయన కేవో!... అయ్యగారికి నీమింద జెపత, నీమింద జెపత అని ఆయన బెదిరిచ్చనూ, మీరు మేపనూ..." చెంచురాముడు జకరయ్యని మందలించడం వినబడింది ఒక రోజున. అది గుర్తుకు రాగానే నవ్వుకున్నారు.

శీనయ్య జకరయ్యలదగ్గర ఈ మర్యాదలన్నీ జరిపించుకుంటూనే, ప్రిన్సిపాలుగారి దగ్గరకొచ్చి 'వాళ్ల మీద కావలసినప్పుడు ఏదన్నా రిపోర్టు రాసిమ్మంటే కాగితంమీద రాసిస్తాన'ని మనవి జేసుకున్నాడు శేషయ్య.

మొదట ఆకాశరామన్న ఉత్తరం చూడగానే ఇట్లాంటి పనిచేసేవాడు శేషయ్యే అయివుండచ్చని అనుకున్నారు. కానీ నెమ్మదిగా ఆలోచించుకున్న మీదట నాలుగునెల్లక్రితం సెలవల్లో శీనయ్య వ్రాసిన ఉత్తరం బయటికితీశారు.

'మహారాజరాజశ్రీ అయ్యగారి దివ్యసమ్ముఖమునకు శీనయ్య అనేక నమస్కారములు. మీరు నాకు దయతో ఉద్యోగం యిచ్చివున్నారు. చాలా విషయాల్లో మీరే తండ్రిదైవమూగా ఆదరించియున్నారు. ఇప్పుడు నేను పెళ్లిచేసుకోబోతున్నాను. మీరు దయతో ఆశీర్వదించగోర్తాను. సెలవు అయిపోగానే తమవద్ద హాజరు పడగలను.

ఇట్లు

విధేయుడు

శీనయ్య'

ఏమాత్రం సందేహంలేకుండా సరిగ్గా యిదే వ్రాతలో వచ్చింది ఆకాశరామన్న ఉత్తరం. అది తలపుకురాగానే రామచంద్రయ్యగారికి కొత్తగా చీకాకు కలిగింది.

శీనయ్య ఒక రోజున గాభరాగా ఒచ్చి "మా వూళ్లో మా అన్నకి ఒంట్లో బాగాలేదు. ఆస్పత్రిలో జేర్చాలి. రెండు రోజులు సెలవు కావాలి" అన్నాడు ఏడుపు మొహంతో.

"వారం రోజులనుంచీ నూట ఆరు జెరం" అన్నాడు. మాటలు కష్టంగా చాల

ప్రయత్నంమీద పెగిలి వొస్తున్నాయి... శీనయ్యకు ఎప్పుడు సెలవు కావాలన్నా వాడికో వాళ్లవాళ్లకో నూటఆరుడిగ్రీల జ్వరం ఒచ్చి వుంటుంది. మొదటిసారి ఆ జ్వరం విషయం విన్నప్పుడు 'డాక్టరుకు చూపించావా? ఏం జ్వరం?' అనడిగారు రామచంద్రయ్యగారు. డాక్టర్లు చూసి చూసీ కనుక్కోలేకుండా పోతున్న ఆ జ్వరం సంగతి రెండుసార్లు విన్నాక యిహ అడగటం మానేశారు...

"ప్రక్క ఊరేకదా మీది. ఒక్కరోజు సెలవు తీసుకుని ఆస్పత్రిలో చేర్చిరా" అన్నారు. తరువాత రెండు రోజులకు వొచ్చింది ఆకాశరామన్న ఉత్తరం. చూడగానే నక్సలైట్ ఉత్తరం కాబోలనుకున్నారు. ఇన్నాళ్లూ పెద్దభూస్వాముల్నీ వడ్డీ వ్యాపారుల్నీ రూపుమాపాలని వేసుకున్న పథకం మార్చుకుని, గవర్నమెంటు ఉద్యోగస్తుల్ని నశింప జెయ్యాలన్న ప్రణాళిక రూపొందించుకున్నారా వాళ్లు ? అన్న అనుమానం కూడా వొచ్చింది.

'ఏమిరా ప్రిన్సిపాల్,

నీకు పొయ్యేకాలం దాపరించింది. జవాన్లకు సెలవు లివ్వకుండా ఏడ్పిస్తున్నావా దొంగ ముండాకొడకా. నీకు యింటిముందూ కాలేజీలో నీ గది దగ్గరా జవాను కూర్చోని వుండటం ముక్యమైందా? నీ పెళ్లాం దొంగముండ. దానికి బజారునుంచీ కూరగాయలు తెచ్చియ్యాలా! నీ పాపం పండుతావుంది. వారం రోజులు టైమిస్తున్నాం. జవాన్ల డ్యూటీలు తీసేసి వాళ్లడిగిన సెలవలిస్తా గౌరవంగా చూడకపోతే నీ అంతం చూస్తాం. మీ అందరి ప్రాణాలు తీస్తాం. పేపర్లలో నీ మీద బూతులు రాయిస్తాం. జాగ్రత్త.

లేబరు కమిటీ'

డూప్టింగ్ ఆర్డరు చేతబట్టుకుని పోతున్న శీనయ్యను వరండాలో పలకరించాడు చెంచురాముడు ఉత్సాహంగా. 'ఏవయ్యా శీనయ్య, అయ్యగార్ని రెండ్రోజులు సెలవడిగి శనాదివారాలు గలుపుకొని నాల్రోజులు అత్తారింటికి పొయ్యొస్తననంటివి. ఎల్లొచ్చావా" అంటూ...

ఇంటర్వ్యూలు అయిపోయాయి. అయిదుగురు అభ్యర్థులూ అయిదురకాలుగా ఉద్యోగాన్నర్థించారు. ఆ ఉద్యోగం వాళ్ల కుటుంబాలకు మూడుపూటలూ తిండి పెట్టే వరం. అందరి మొహాల్లోనూ ఆశ,సందేహం,నిస్పృహ-అన్నీ కలిసిన ఏదోభావం... ఉద్యోగం దొరికేవరకూ దైన్యం. దొరగ్గానే ఉత్సాహం పుంజుకుని వాళ్ల వ్యక్తిత్వం ప్రకాశించటం ప్రారంభిస్తుంది. బాగుంది! అనుకున్నారు.

ఇప్పుడు శీనయ్య ఈ పని చేశాక ఎవర్ని చూసినా వీడు ఎట్లాటివాడో? అనిపిస్తున్నది.

ఆలోచనారహితంగా కిటికీబయటకు చూస్తూ ఉండిపోయారు రామచంద్రయ్య

గారు... ఏకాగ్రతతో చూస్తున్న ఆయన కళ్లముందు నేల మిరుమిట్లుగొలుపుతూ తేజోమయమైనది. మట్టి ప్రాణాన్ని సంతరించుకొని చైతన్యపూర్ణమై వివిధాల లాస్యం చెయ్యనారంభించింది...

ప్రతి మట్టికణమూ ఒక మహాచైతన్యం. అంతా కలిసీ ఒకే చైతన్యం, ఒకే ప్రాణం, ఒకే తేజస్సు!

ఆ తేజస్సులో నుండీనే ఆవిర్భవిస్తున్నాయి వివిధాలైన రూపాలూ వింత ప్రాణాలూనూ...

ఆ తేజోవిలాసమే బారలు చాచుకున్న ప్రాణం వెల్లివిరుస్తున్న బాదంచెట్టు. గాని మరోరూపమే కునుకుతున్న లిల్లీ మొక్క. అదే ముద్దమందారం. అదే కలుపుమొక్కలు... అవును, కలుపుమొక్కలు!

అన్నీ, అన్నీ, అదే!

ఆ వింతదర్శనం రామచంద్రయ్యగారి మనసుకు ప్రశాంతతనీ ఆహ్లాదన్నీ కలిగించింది.

"లిస్టులో నా పేరు రాలేదనుకో. అయినా యిచ్చేవోళ్ల యిష్టంగెంద. పోయిన తడవ యీ సీపరు పని వొచ్చినపుడు దెశయ్య గారి కాడ రికమెండేసను జేయించిన... ఆ కాసింత సాయం జెయ్యటానికి ఆ దెశెయ్యగారింట్లో రెండేళ్లమట్టీ మాయమ్మ సిల్లర మల్లర పనులన్నీ జేసిపెడతా వుంది. అదిగో ఆస్పటాల్లో యిప్పిత్త యిదిగో ఆపీసులో యిప్పిత్త అంటానే జరుపుకొచ్చినడు. ఆకరికి యీ కాలేజిలో యిప్పించిండు... ఈతడు ఆ సిన్నోళ్ల దెగ్గిరి కెందుకో, ఏకంగా పెద్దోళ్ల కాళ్లే అట్టుకుందావని అయ్యగారిసే అడిగినా... ఏడాదిమట్టీ వూడవటం, తోటపని, వోటలునుంచి కాపీలు తెచ్చియ్యటం, ఏం పని జెప్పిన కాదనకుండ జేత్తన్నానా అయ్యగారికి మాత్తరం తెలవగా... ఏం జేత్తారో..." చెంచురాముడు జకరయ్యకు చెప్పుకుంటున్నాడు.

రామచంద్రయ్యగారికి నవ్వొచ్చింది. ఇదివరలో వాడికి ఉద్యోగం రావటంలో దశరథరామయ్యగారి జోక్యం ఏమీ లేదు. లిస్టులో వాడి పేరు వొచ్చింది. వొచ్చిన వాళ్లలో చూచి తానే యిచ్చారు పని...

కాలింగ్ బెల్ వినగానే చెంచురాముడి వాక్ప్రవాహం ఆగిపోయింది. ఇంటర్వ్యూకి వొచ్చినవాళ్లల్లో వొకరికి ఉద్యోగం యిస్తున్నట్లు ఆర్డరు టైపు చేయించటానికి ఆఫీసుకు తీసుకెళ్లాడు ఉత్సాహంగా...

వెళ్తున్న చెంచురాముణ్ణి చూస్తూ 'ఆ కాగితంలో ఏముందో తెలిసినా వీడు యిట్లాగే ఉత్సాహంగానే తీసుకెళ్తాడు' అనుకున్నారు. అలా అనుకుంటే ఆయనకు చాల సంతోషం కలిగింది.

అనేక యుగాలనుంచీ మానవ జాతిని అసంతృప్తిలో మగ్గిపోకుండా నశించిపోకుండా నడిపించుకువస్తున్న జీవనధర్మం ఏదో వాడిలో నుంచీ తొంగి చూస్తున్నట్లనిపించింది.

చెంచురాముడు జకరయ్యకిచ్చిన ఉపన్యాసాల్లోని మరో భాగం గుర్తు కొచ్చింది... 'పండక్కి ఏం అప్పచ్చులు తిన్నావ'ని అడిగిన జకరయ్యతో '... పండగేందయ్యా... రోజా రెండు పూటల బువ్వతినటం పండగగాదా... అంతకంటె పండగేంది... బతకటమే పండగ అనేవాడు మా బాబు...' ఎందుకో ఆ మాటలూ, అవి పలికిన వాడి నవ్వే గొంతూ రామచంద్రయ్యగారి మనసులో నాటుకపొయ్యాయి... సంకీర్ణంగా అల్లుకుపోయిన ప్రపంచపు నెరియల్లోంచి నవ్వుతూ తొంగిచూస్తున్న రహస్యం-బ్రతకడమే పండుగ.

★★★